

## బాధిత కుటుంబానికి పరామర్శ

రాజంపేట, సెప్టెంబరు 16: మండలంలోని ఎల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన ముక్కిరి ఎల్లయ్య విద్యుత్ ప్రమాదంలో మృతిచెందడంతో ఆయన కుటుంబాన్ని మండల కాంగ్రెస్‌వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రణీత్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేవిధంగా ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు శ్రీధర్, బన్సీలాల్, నాయకులు బీరయ్య, నరేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన దినోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

- అధికారికంగా నిర్వహించనున్న రాష్ట్ర ప్రభుత్వం
- కలెక్టరేట్‌లో ఏర్పాట్లు
- జాతీయ పతకాన్ని ఆవిష్కరించనున్న టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్
- తెలంగాణ విమోచన దినోత్సవంగా చేపట్టనున్న బీజేపీ
- సాయుధ పోరాటంలో జిల్లా ప్రముఖులు
- నిజాంను ఎదురించిన పోరాట యోధులు
- కామారెడ్డిలో ఫణిహారం రంగాచారి.. కుప్రియాల్‌లో గోపాల్‌రెడ్డి.. ఎర్రపహాడ్‌లో బొక్క గుండారెడ్డి

కామారెడ్డి, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత బీఆర్ఎస్‌ప్రభుత్వం సెప్టెంబరు 17ను తెలంగాణ జాతీయ సమైక్య దినోత్సవంగా ప్రకటించింది. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో కాంగ్రెస్ ప్రభుత్వం సెప్టెంబరు 17ను ప్రజాపాలన దినోత్సవంగా ప్రకటించింది. ఈ ప్రజాపాలన దినోత్సవాన్ని ప్రభుత్వం అదికారిక కార్యక్రమాలను చేపడుతుంది. మంగళవారం కామారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ జాతీయ జెండాను ఎగురవేయనున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన దినోత్సవంగా చేపడుతుంటే బీజేపీ మాత్రం తెలంగాణ విమోచన దినోత్సవం అంటూ కార్యక్రమాలు చేపట్టిందుకు సిద్ధమైంది. బీఆర్ఎస్‌ఆయాపార్టీ కార్యాలయాల్లో సెప్టెంబరు 17ను పురస్కరించుకుని జాతీయ జెండాలు ఎగురవేయనున్నారు. బీజేపీ ఇప్పటికీ తెలంగాణ విమోచన దినోత్సవంగా ప్రకటించాలంటూ పలు ఆందోళనలు చేపడుతోంది. ఇక కమ్యూనిస్ట్ పార్టీలు విద్రోహ దినోత్సవంగా చేపడుతున్నాయని ఇలా సెప్టెంబర్ 17ను ఒక్కో రాజకీయ పార్టీ ఒక్కో విధంగా నిర్వహిస్తున్నాయి.



ఫణిహారం రంగాచారి

మిత్రుడు విఠల్‌రావుతో ఫణిహారం రంగాచారి (ఫైల్)





ప్రజాపాలన కార్యక్రమానికి కలెక్టరేట్‌లో ఏర్పాట్లు చేస్తున్న దృశ్యాలు

### • సాయుధపోరాటంలో కామారెడ్డి వాసి ఫణిహారం రంగాచారి

తెలంగాణ సాయుధ పోరాటంలో కామారెడ్డి జిల్లా చరిత్ర ఎంతో ఘనమైనది. ఎంతోమంది సాయుధ పోరాట యోధులు తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొని నైజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమించారు. ఫణిహారం రంగాచారి, రాజారెడ్డి, కుప్రియాల్ గోపాల్‌రెడ్డి, ఎర్రపహాడ్‌కు చెందిన బొక్క గుండారెడ్డి వంటి ఎందరో ఉద్యమ వీరులు పోరాట స్ఫూర్తిని నింపి జిల్లాకే గర్వకారణంగా మారారు. కామారెడ్డి పట్టణానికి చెందిన ఫణిహారం రంగాచారి సాయుధ పోరాట యోధులలో ఒకరు. ఫణిహారం రంగాచారి మధ్యతరగతి కుటుంబంలో జన్మించారు. అతని తండ్రి లక్ష్మణాచారి పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేశారు. అదే పాఠశాలలో చదువుతున్న రంగాచారి చిత్రలేఖనంలో మంచి ప్రావీణ్యం సాధించారు. ఆ పాఠశాలలో ఉన్న చిత్రలేఖనం ఉపాధ్యాయుడు బషీరొద్దీన్ రంగాచారితో పాటు అతని మిత్రుడు విఠల్‌రావును మరింత ప్రావీణ్యం సాధించడానికి హైదరాబాద్‌లోని ఫైన్ ఆర్ట్స్ కళాశాలలో చేర్పించారు. 1943వ సంవత్సరంలో రంగాచారి తండ్రి లక్ష్మణాచారి అనారోగ్యంతో మృతిచెందడంతో రంగాచారికి ఆర్థికంగా ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో అతని మిత్రుడు విఠల్‌రావు సహాయంతో ట్యూషన్స్ చెబుతూ మెరిట్ స్కాలర్‌షిప్‌తో అతని చదువును కొనసాగించారు. రంగాచారి కళాశాలల్లో చదివే రోజుల్లోనే రజాకార్ల కార్యకలాపాలు ఉధృతంగా ఉండేవి. రజాకార్ల కార్యకలాపాలకు ధీటుగా ఆర్యసమాజ్ తీవ్రంగా పోరాడుతుండేది. దీంతో రంగాచారి విఠల్‌రావులు ఆర్య సమాజం పట్ల ఆకర్షితులై అందులో చేరారు. కానీ ఆర్యసమాజ్ కేవలం హిందువులకు మాత్రమే ప్రాతినిధ్యం వహించడంతో రంగాచారి, విఠల్‌రావులు అందులో నుంచి బయటకు వచ్చి హైదరాబాద్ స్టూడెంట్ యూనియన్‌లో చేరి విద్యార్థి ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. అదేసమయంలో కామ్రేడ్ అసోసియేషన్ నాయకుడైన డాక్టర్ రాజ్ బహదూర్‌గౌడ్, మఖ్దూం మొహియొద్దీన్, రావినారాయణరెడ్డిలతో సంబంధాలు ఏర్పాటు చేసుకొని హైదరాబాద్ సంస్థానంలో ప్రజలు జరుపుతున్న ఉద్యమాలపై సామాజిక సమస్యలపై చిత్ర ప్రదర్శనలు ఏర్పాటు చేసేవారు. భూస్వాముల దోపిడిపై నిర్బంధ పన్నుల వసూళ్లపై రంగాచారి ఎన్నో తైలవర్ణ చిత్రాలు వేసేవారు. 1946లో భారత కమ్యూనిస్టుపార్టీ హైదరాబాద్ సంస్థానంలో నిషేదానికి గురికావడం, ఆ పార్టీ కార్యదర్శి రాజ్‌బహదూర్ గౌడ్ అరెస్ట్ కావడం జరిగింది. దీంతో రంగాచారితో పాటు మరికొందరు నాయకులు పార్టీ దళితుల కోసం వివిధవర్గాల నుంచి ఆయుధాలను సేకరించి తెలంగాణ పోరాట ప్రాంతం నుంచి రహస్యంగా ఆయుధాలను చేరవేసే వారు. ఆయుధాలను చేరవేస్తుండగా జరిగిన అపాయంలో గాయపడ్డ డాక్టర్ రాజ్ బహదూర్‌గౌడ్‌ను పోలీసు కస్టడీలో ఉన్నప్పటికీ ఉస్మానియా ఆస్పత్రి నుంచి ఆయన్ను తప్పించడంలో రంగాచారి కీలకపాత్ర వహించారు. అంతే కాకుండా నాటి విద్యార్థి నాయకుడు చెన్నమనేని రాజేశ్వర్ రావును సైతం మతోన్మాద గుండాల నుంచి రక్షించినట్లు చరిత్ర చెబుతోంది. రహస్యస్థావరాల్లో ఉన్న కార్యకర్తలను ఆనే కవిదాలుగా రక్షణ కల్పిస్తూ ఉత్తేజపూరితమైన ఉపన్యాసాలను రంగాచారి ఇచ్చేవారు. తెలంగాణ సాయుధ పోరాటానికి చెందిన పి.రాంచంద్రారెడ్డిని ఆనాడు ఎలుగుబంటి దాడి చేయడంతో అతన్ని చికిత్స నిమిత్తం రంగాచారి రహస్య స్థావ రానికి తీసుకెళ్లారు. రక్తం మరుకలతో స్థావరాన్ని కనుగొన్న పోలీసులు 1949 జూలై 23న రంగాచారితోపాటు అక్కడే ఉన్న వెదిరే రాజిరెడ్డిలను అరెస్టు చేసి చంచల్‌గూడ పోలీసు స్టేషన్‌కు తరలించారు. చిత్ర హింసలు పెట్టినా కమ్యూనిస్టు ఉద్యమాలకు సంబంధించిన విషయాలను రంగాచారి పోలీ సులకు ఏమీ చెప్పకపోవడంతో వారిని వరంగల్‌లోని మా మునూర్ కాన్సెంట్రేషన్ (ముళ్లకంచె కలిగిన బహిరంగ నిర్బంధ ప్రదేశం) క్యాంపుకు తరలించారు. అయినప్పటికీ రంగాచారి రహస్యాలు ఏమీ చెప్పకపోవడంతో 1949 అక్టోబర్ 29న రంగాచారితోపాటు వెదిరే రాజిరెడ్డిలను పోలీసులు అత్యంతక్రూరంగా కాల్చిచంపారు. పట్టణంలోని పెద్దబజార్ ప్రాంతంలో రంగాచారితోపాటు అతని మిత్రుడు విఠల్‌రావు నివాసం ఉండేవారు.

### కుప్రియాల్ గోపాల్‌రెడ్డిది గొప్ప చరిత్ర

సాయుధ పోరాటంలో కామారెడ్డి జిల్లాలో రజకార్ల ఆగడాలను ఎదిరించిన యోదుల్లో సదాశివనగర్ మండలం కుప్రియాల్ గోపాల్‌రెడ్డి ఒకరు. మల్లన్నగుట్టపై రజకార్లను ఎదిరించి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అంతకు ముందు తలమడ్లలో, మద్దికుంటలో గల రైస్‌డిపోలపై దాడి చేసి బియ్యాన్ని కొల్ల గొట్టి గ్రామాల్లో పంచారు. అంతేకాకుండా భూమిలేని నిరుపేదలకు భూమిని పంచి రజకార్ల గుండెల్లో గుబులు పుట్టించారు. మారు వేశంలో గ్రామాల్లో రాత్రి వేళ్లలో సమావేశాలు నిర్వహించి రజకార్లకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్య వర్చారు. అలాగే తాడ్వాయి మండలం ఎర్రాపహాడ్‌కు చెందిన బొక్క గుండారెడ్డి, బొక్క గంగారెడ్డి, బద్దం రాజిరెడ్డి, చాకలి ఎల్లయ్య, గొల్ల లచ్చయ్య, దండు రాజన్న, లింగంగౌడ్‌తోపాటు మరో ఎంతో మంది కామారెడ్డి డివిజన్‌లోని గ్రామాల్లో కూడా రజకార్ల చర్యలను వ్యతిరేకించి సాయుధపోరాటంలో పాల్గొన్నవారి చరిత్రలు ఉన్నాయి.

### ప్రజా ఉద్యమానికి నాంది పలికిన వకీల్ భూమారెడ్డి

బ్రిటిష్ ఇండియా హయంలో జరిగిన స్వాతంత్ర్య పోరాటంలో జాతీయ కాంగ్రెస్ పాత్ర ఎంత ఉందో హైదరాబాద్ సంస్థాన విముక్తి పోరాటంలో తెలంగాణ ప్రజల పాత్రకూడా అంతేఉంది. ఇక్కడి ప్రజలను చైతన్య పరచడంలో అప్పటి ఆంధ్రమహసభలు ఎంతగానో దోహదం చేశాయి. ఇలాంటి ప్రజాఉద్యమం కొనసాగిన నేపథ్యంలో తెలంగాణ ప్రజలలో ఆంధ్రమహసభలు ఎంతో చైతన్యం కలిగించాయనేది చారిత్రక వాస్తవం. నిజాంనవాబు పాలనలో హైదరాబాద్ రాష్ట్రంగా కొనసాగిన తరుణంలో కామారెడ్డి జిల్లాలోని దోమకొండసంస్థాన పరిధిలోని అంబారీపేట గ్రామానికి చెందిన బెంజారం రామ్‌రెడ్డిరెండో కూమారుడైన భూమారెడ్డి అలియాస్ వకీల్‌భూమారెడ్డి అప్పటి ఆంధ్రమహసభ సభ్యునిగా కొనసాగారు. న్యాయవాదిగా కొనసాగుతునే పర్తక స్వాతంత్ర్యం, వెట్టిచాకిరి నిషేదం అనే పుస్తకాల ద్వారా కామారెడ్డిలోని గ్రామాలలో పర్యటించి, గ్రామీణ ప్రజలలో చైతన్యం నింపారు. ఈ క్రమంలో ఫారెస్ట్, రెవెన్యూ అధికారి,పోలీసు అధికారుల అక్రమ వసూళ్లబారి నుండి భూస్వాముల వెట్టి చాకిరి నుంచి ఇక్కడి ప్రజలను వర్తకులను కాపాడారు.

### ప్రజాపాలన దినోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం నిర్వహించే ప్రజాపాలన దినోత్సవానికి కలెక్టరేట్‌లో ఏర్పాట్లు పూర్తిచేశారు. తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్‌రమేష్‌రెడ్డి ముఖ్యఅతిధిగాహజరై జెండాను ఆవిష్కరిస్తారు. కలెక్టరేట్ ఆశీష్ సంగ్వాన్ విద్యాశాఖ ఆద్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాటుతో పాటు ఆయా శాఖలకు పలు సూచనలు చేశారు.

## పులిపిరి ఆకు పసరుతో మటుమాయం

నిజామాబాద్ జిల్లా : అందమైన శరీరంపై పులిపిర్లు వచ్చి ఎంతగానో చింతిస్తున్నారా? అయితే ఇప్పుడు ఆ దిగులు అవసరం లేదు అంటున్నాడు మన సేవా రత్న, విశిష్ట పురస్కారం అవార్డ్స్ అందుకున్న వడియార మల్లిఖార్జునుడు.



**వైద్యానికి దారి తీసిన విధానం**

గతంలో ఈ మల్లికార్జునరావు ఒక వైద్యుని దగ్గర సహాయకుడు. అతనికి పులిపిర్లు అధికంగా వుండేవి. సదరు వైద్యులను సంప్రదించినా ఫలితం లేదు కదా అవి ఇంకా వృద్ధిచెందేవి. తీరా శ్రీశైలం అడవులనందు ఎవరో వైద్యుడు ఈ పులిపిర్లకు వైద్యం అందిస్తున్నారు అని తెలిసింది. త్వరితగతిన అక్కడికి వెళ్లగా పులిపిర్లు మటుమాయం. ఆ క్షణం నుండి ఈ మల్లికార్జునుడు శ్రీశైలంలోని ఆ పులిపిర్ల వైద్యుని వెంటపడి తను కుదరదు అన్న వినకుండా అన్నిరకాలుగా ఈ వైద్యాన్ని అవపాసన పట్టించాడు. తన గురువుగారు తనువు చాలించాక ఇప్పుడు తన శిష్యుడైన ఈ మల్లి అదే వైద్యాన్ని కొనసాగిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా తన వైద్య సేవలు అందిస్తున్నాడు.

**17, 18, 19,** తేదీల్లో నిజామాబాద్ జిల్లా, హోటల్ హరిత ఇందూర్, పంచవటి మెగామార్ట్ పైన, రైల్వే స్టేషన్ ఎదురుగా, నిజామాబాద్ నందు వైద్యం. ఒక్క చిన్న పులిపిరికి కేవలం రూ.100/- మాత్రమే, పెద్దపులిపిరికి (సైజును బట్టి చార్జి చేయబడును). ఈ పులిపిరి వైద్యం షుగర్ వ్యాధి ఉన్నవారు కూడా చేయించుకోవచ్చును. ఉదయం 9.00 గం. నుండి సాయంత్రం 6 గం. వరకు ఈ వైద్యసేవలు అందించబడును. అపాయింట్‌మెంట్స్ కొరకు ఫోన్ నం.: **9849628485**ను సంప్రదించగలరు. ఒక వేళ ఈ క్యాంపుకు రాలేకపోయినవారు హైదరాబాద్‌లోని బాలాపూర్‌లో గల మా క్లీనిక్ లో వచ్చి వైద్యం చేయించుకోగలరు ఫోన్ నం. **9440251969** మరిన్ని వివరాలకు youtube: pulipiri mallikarjun లో చూడండి

**మల్లి చేతిలో దివ్యమైన మూలికలు**

సాధారణంగా 7 రకాలుగా కనిపించే ఈ పులిపిర్లు మనిషి శరీరంపై ఎక్కడైనా రావచ్చు. "హ్యూమన్ పాపిలోమా వైరస్" కారణం ద్వారా మరియు వంశపారంపర్యంగా కూడా ఈ పులిపిర్లు రావచ్చు. అయితే ఏ రకమైన పులిపిరినైనా సరే తను సేకరించిన పొడిని తడిపిన దూదితో పులిపిరిపై అద్ది మరుక్షణం కదిపేస్తాడు. అనంతరం అదే పొడిని మరలా తీసిన ప్రదేశంలో అద్దుతాడు. అంతే వైద్యం అయిపోయింది. తన 27 సంవల అనుభవంతో సామాన్యుల నుండి ప్రముఖులు కొన్ని వేల మంది ఈ వైద్య సేవలు పొందారు. ఈ వైద్యం మనకు అందుబాటులో వుండటం మనం గర్వించదగ్గ విషయం.

# గణనాథుడు గంగమ్మ ఒడికి..



- జిల్లాలో ఘనంగా వినాయక నిమజ్జనం
- కామారెడ్డి జిల్లా కేంద్రంలో అట్టహాసంగా ప్రారంభమైన వినాయక నిమజ్జన శోభాయాత్ర
- భాగ్యనగరాన్ని తలపించేలా శోభాయాత్ర • నిమజ్జనానికి పోలీసుల భారీ బందోబస్తు
- ప్రత్యేక కంట్రోల్ రూం ఏర్పాటు • సీసీ కెమెరాలు, వీడియో కెమెరాల పర్యవేక్షణలో సాగిన శోభాయాత్ర

కామారెడ్డిటౌన్, సెప్టెంబరు16: నవరాత్రులు భక్తిశ్రద్ధలతో పూజలందుకున్న వినాయకుడు మంగళవారం గంగమ్మ ఒడికిచేరాడు. జిల్లాలోని పలు మండలాల్లో పెద్దఎత్తున శోభాయాత్రలు, గణేష్ నిమజ్జన కార్యక్రమాలు జరిగాయి. తాడ్వాయి, బీబీపేట, రామారెడ్డి, మాచారెడ్డి, సదాశివనగర్, భిక్కనూర్, దోమకొండతోపాటు పలు మండలాల్లో శోభాయాత్రలు నిర్వహించి డప్పు, బ్యాండు వాయిద్యాలతో నిమజ్జన కార్యక్రమాలు చేపట్టారు. ఇక కామారెడ్డి జిల్లాకేంద్రంలో అట్టహాసంగా వినాయకుని శోభాయాత్ర సోమవారం రాత్రి ప్రారంభమైంది. భాగ్యనగర్‌ను తలపించేలా కామారెడ్డిలో వినాయకుని శోభాయాత్రను విశ్వహిందుపరిషత్, గణేష్ ఉత్సవసమితి అధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆశీష్‌సంగ్వాన్, ఎస్పీ సింధూశర్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ చంద్రశేఖర్‌రెడ్డి శోభాయాత్రను కొబ్బరి కాయలు కొట్టి ప్రారంభించారు. సిరిసిల్లా రోడ్డులోని ధర్మశాల నుంచి భక్తుల జయజయ ధ్వనులతో డప్పుచప్పుళ్లు, కళాకా రుల నృత్యాలు, పాటలకు అనుగుణంగా యువకులు చిందులు వేస్తూ శోభాయాత్రను ప్రారంభించారు. భారీ పోలీసు బందోబస్తు మధ్య శోభాయాత్ర ప్రారంభమైంది.

### జనసంద్రంగా కామారెడ్డి

గణేష్ నిమజ్జనోత్సవానికి కామారెడ్డిలోని రోడ్లన్నీ జనసంద్రంగా మారాయి. శోభాయాత్ర జరిగే వీధులు సిరిసిల్లారోడ్డు, స్టేషన్‌రోడ్డు, సుభాష్‌రోడ్డు, తిలక్‌రోడ్డు, జేపీఎన్‌రోడ్డు, మాయబజార్, వేణుగోపాల్ స్వామిరోడ్డు,పెద్దబజార్ రోడ్లన్నీ భక్తులతో కిక్కిరిశాయి. శోభాయాత్రకు ప్రత్యేక ఆకర్షణగా ఉండే విధంగా గణేష్ మండపాల నిర్వాహకులు వివిధ అలంకరణలతో దేదీప్యమానంగా, రమణీయంగా వెలిగొందే రంగురంగుల విద్యుత్ దీపాలతోపాటు పూలతో అలంకరణ చేసిన రథాలను మండపాల నిర్వాహకులు పోటాపోటీగా తీర్చిదిద్దారు. శోభాయాత్రను తిలకించేందుకు కామారెడ్డి ప్రజలే కాకుండా చుట్టు పక్కల గ్రామాల నుంచి ప్రజలు, భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. హైదరాబాద్‌లోని వినాయక శోభాయాత్ర మాదిరిగా కామారెడ్డిలో నిమజ్జన శోభాయాత్ర ప్రారంభమైంది. మండపాల నుంచి గణనాథులు కదిలేముందు లడ్డూ వేలాలను నిర్వహించారు. భక్తులకు ఆయా దుకాణాల యజమానులు తమ దుకాణాల ఎదుట పులిహోర, సిరా, ఉప్మా పంపిణీ చేశారు.

### డప్పు వాయిద్యాలు - యువకుల నృత్యాలు

కామారెడ్డిలో వినాయక నిమజ్జన శోభాయాత్రకు డప్పు వాయిద్యాలు, యువకుల నృత్యాలు పాటలకనుగుణంగా లేజర్ కిరణాల మధ్య భూమి కంపించేలా రణగోణ ధ్వనులతో వివిధ బ్యాండ్లు, డప్పుల చప్పుళ్ల మధ్య గణేష్ శోభాయాత్ర ఉత్సాహంగా కొనసాగింది. యువకుల కేరింతలు, నృత్యాల మధ్య గణనాథులకు ఘనంగా భక్తులు వీడ్కోలు తెలిపారు. బుధవారం ఉదయం వరకు కామారెడ్డి శివారులోని టేక్రియాల్ సమీపంలో గల అడ్లూర్ ఎల్లారెడ్డి పెద్ద చెరువులో నిమజ్జనం చేయనున్నారు. కామారెడ్డిలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పలుభారీ విగ్రహాలను, మట్టి వినాయకులను పలు సంఘాల వారు, ఇళ్లలో నెలకోల్పిన విగ్రహాలను సైతం పలువురు సోమవారం

### కంట్రోల్ రూం ఏర్పాటు - భారీ బందోబస్తు

కామారెడ్డిలో వినాయక శోభాయాత్ర సందర్భంగా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఎస్పీ సింధూశర్మ అధ్వర్యంలో ఏఎస్పీ, డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు బందోబస్తు విధులు నిర్వహించనున్నారు. ఇకవీరితో పాటు స్పెషల్‌పార్టీ పోలీసులు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు బందోబస్తులో సేవలు అందించనున్నారు. గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సిరిసిల్లా రోడ్డులోని ఇందిరా చౌక్ వద్ద ఏర్పాటు చేసిన వేదికపై పట్టణ ప్రముఖులు గణనాథులకు స్వాగతం పలికారు. గణేష్ వేడుకల ఔన్నత్యాన్ని చాటిచెప్పారు. భక్తుల సందడితో కామారెడ్డి వీధులన్నీ కళకళలాడాయి. చెరువువద్ద బారికేడ్లు, క్రేన్‌తో పాటు గజ ఈతగాళ్ళ, లైటింగ్‌ను మున్సిపల్ అధికారులు ఏర్పాటుచేశారు. గణేష్ మండపాల నిర్వాహకులకు ఇబ్బందులు తలెత్తకుండా చెరువు వద్ద కంట్రోల్



జిల్లా కేంద్రంలో శోభాయాత్రను ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎస్పీ, మున్సిపల్ చైర్‌పర్సన్



వినాయకుల విగ్రహాలను చెరువులో నిమజ్జనం చేస్తున్న దృశ్యం



మృతిచెందిన బుజ్జిగారి ఏసు

బుజ్జిగారి ఏసు (ఫైల్)

## గణేష్ నిమజ్జనంలో అపశృతి

### • చెరువు నీటిలో మునిగి యువకుడి మృతి

ఎల్లారెడ్డి, సెప్టెంబరు 16: గణేష్ నిమజ్జనం సమయంలో ఓ యువకుడు మృతిచెందిన ఘటన ఎల్లారెడ్డిలోని లింగారెడ్డిపేట్ హరిజనవాడలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలోని 11వ వార్డుకు చెందిన బుజ్జిగారి ఏసు (25) హరిజనవాడ గణేష్ మండలంలో ఉన్న వినాయకుడిని నిమజ్జనం చేయడానికి స్థానికులతో కలిసి వెళ్లాడు. అదే ప్రాంతంలో ఉన్న పటేల్‌చెరువులో నిమజ్జనం చేయడానికి వెళ్లి నిమజ్జనం చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు కాలు జారి నీటిలో మునిగిపోయాడు. గమనించిన స్థానికులు ఈ విషయాన్ని పెద్దలకు సమాచారం అందించడంతో కోనచింతల రాములు, పేశెట్టి రవీందర్‌తోపాటు కొందరు గజ ఈతగాళ్లను రప్పించి చెరువులో యువకుడి కోసం గాలించారు. కొంత సేపు తర్వాత మృతదేహం లభ్యమైందని తెలిపారు. ఈ ఘటనలో ఆ గ్రామ పరిధిలో విషాదఛాయలు నెలకొన్నాయి.



బీర్కూర్‌లో చెరువు కట్ట వద్ద నిమజ్జనం ఏర్పాట్లను పరిశీలిస్తున్న దృశ్యం

## గణేష్ నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

బీర్కూర్, సెప్టెంబరు16: బీర్కూర్ మండల కేంద్రంలో గణపతి నిమజ్జనం ఏర్పాట్లను సోమవారం గ్రామ పంచాయతీ కార్యదర్శి గంగారాం, మాజీ ఎంపీపీ రఘులు పరిశీలిందారు. ఈ సందర్భంగా జీపీ కార్యదర్శి గంగారాం మాట్లాడుతూ గణేష్ విగ్రహాల నిమజ్జన కార్యక్రమంలో భాగంగా చెరువుల వద్ద తగు ఏర్పాట్లు చేశామని అన్నారు. గణేష్ విగ్రహాలు రాత్రి వేళలో నిమజ్జనంచేయనున్నందున చెరువు కట్టల వద్ద వెలుతురు కోసం లైటింగ్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా గ్రామ పంచాయతీ సిబ్బంది, ఈతగాళ్లను అందుబాటులో ఉంచామన్నారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ రఘు, జీపీ సిబ్బంది ఉన్నారు.




# సిద్దులగుట్టపై ప్రత్యేక పూజలు

పెర్కిట్, సెప్టెంబరు 16: ఆర్మూర్ పట్టణంలోని నవనాథ సిద్దులగుట్టపై సోమవారం భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి శివాలయంలో పంచామృతల తో అభిషేకాలు చేశారు. అదే విధంగా రామాలయం, దుర్గామాత, దత్త త్రేయ, అయ్యప్ప, ఎల్లమ్మతల్లి ఏకశీల స్తంభం వద్ద హన్మాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సందీశ్వర మహరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పల్లకి సేవలో భజనలు చేస్తూ భక్తిగీతలు పాడుతూ నృత్యాలు చేస్తూ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఆకట్టుకున్నారు. దూర ప్రాంతాల నుంచి భక్తుల సౌకర్యార్థం కాటేజీల నిర్మాణం కొరకు విరాళాలు ఇవ్వడానికి ఆలయ కమిటీ సభ్యులను సంప్రదించాలని తెలిపారు. భక్తులందరి సహాయ సహకారాలతో ప్రతీ సోమవారం అందించే అన్నదాన ప్రసాదంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బి.సుమన్, వీసీ.గంగారెడ్డి, కొడిగెల మల్లయ్య, బోండ్ల ఆనంద్, చరణ్‌రెడ్డి, బట్టు శంకర్, చెందేశీ శ్రీనివాస్, ప్రశాంత్‌గౌడ్, జనార్ధన్‌గౌడ్, కొంతం మురళీ, రామాగౌడ్, సిద్దులగుట్ట సేవ సమితి సభ్యులు పాల్గొన్నారు.


సిద్దులగుట్టపై పల్లకి సేవలో పాల్గొన్న భక్తులు

## అథ్లెటిక్స్ పోటీల్లో కస్తూర్బా విద్యార్థుల ప్రభంజనం

భీమగల్, సెప్టెంబరు 16: సౌత్‌జోన్ జూనియర్ అథ్లెటిక్స్ ఓవరల్ చాంపియన్‌షిప్‌ను భీమ్‌గల్ కస్తూర్బాగాంధీ పాఠశాల విద్యార్థులు కైవసం చేసుకున్నారు. జిల్లా అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని రాజారాం స్టేడియంలో నిర్వహించిన సౌత్‌జోన్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొన్న కస్తూర్బా పాఠశాల విద్యార్థులు 13మెడల్స్ సాధించి ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి స్వామి, పాఠశాల స్పెషల్ ఆఫీసర్ స్రవంతి, పీఈటీ సువర్ణ, క్రీడాకారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

## మహాగణపతికి 51రకాల నైవేద్యాలు

భీమ్‌గల్‌రూరల్, సెప్టెంబరు 16: భీమ్‌గల్ మండలంలోని పల్లికొండ గ్రామంలో గణేష్ ఉత్సవాల్లో భాగంగా సోమవానం హవా యూత్ ఆధ్వర్యంలో సోమవారం మహాగణపతికి 51 రకాల నైవేద్యాలు సమర్పించారు. ప్రతీ ఏడాది మండపంలో గణపతికి వివిధ రకాల నైవేద్యాలు సమర్పిస్తామని నిర్వాహకులు తెలిపారు. ప్రతీ సంవత్సరం విధంగానే ఈ సారి కూడా సాంస్కృతిక కార్యక్రమాలు, భక్తులకు ప్రతీ రోజు అన్నదానం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హవా యూత్ సభ్యులు పిట్ల రంజిత్, రోహన్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సారెస్పీని సందర్శించిన రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్

మెండోర, సెప్టెంబరు16: శ్రీరాంసాగర్ ప్రాజెక్టును, జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిండుకుండల నిండడంతో ప్రాజెక్టును సందర్శించి ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదనీటి వివరాలను ప్రాజెక్టు ప్రధాన కాలువల ద్వారా నీటి విడుదలను ప్రాజెక్టు అధికారులను అడిగితెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారులు జల విద్యుత్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరా మహిళా శక్తి క్యాంటిన్ ప్రారంభం

ఆర్మూర్‌టౌన్, సెప్టెంబరు 16: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సి పల్ చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య ఇందిరా శక్తి క్యాంటిన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జర్నలిస్టు కాలనీ సమాఖ్య ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన క్యాంటిన్ ద్వారా మహిళల ఆర్థికాభివృద్ధికి తోడ్పాడుతుందని, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరా మహిళ శక్తి కార్యక్రమం ద్వారా ప్రజలు మహిళ సంఘాల ద్వారా తయారు చేసే తెలంగాణ పిండి వంటకాలను ప్రోత్సహిస్తూ మహిళ సంఘాల పురోగతికి తోడ్పాడాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజు, బీజేపీ ఫ్లోర్ లీడర్ జీవీనర్సింహారెడ్డి, కౌన్సిలర్‌లు ఆకుల రాము, శాల ప్రాద్, ఫయాజ్, తదితరులు పాల్గొన్నారు.






























## బట్టాపూర్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు



బట్టాపూర్‌లో సభ్యత్వం నమోదు చేసుకుంటున్న బీజేపీ నాయకులు

ఏర్గట్ల, సెప్టెంబరు 16: మండలంలోని బట్టాపూర్ గ్రామంలో సోమవారం భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించినట్లు మండల పార్టీ అధ్యక్షుడు ఎలేటి నారాయణ రెడ్డి తెలిపారు. అందులో భాగంగా గ్రామంలోని యువత పెద్ద ఎత్తున సభ్యత్వం స్వీకరించినట్లు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో సభ్యత్వం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు కొండ గణశ్యామ్, ప్రసాద్, తిరుమతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ఆర్మూర్‌టౌన్:** మున్సిపల్ పరిధిలోని 16వార్డు బీజేపీ సభ్య త్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ప్రధాని మోదీ అభిమానులు బీజేపీ సభ్యత్వ నమోదు చేసుకున్నట్లు,మొబైల్‌లోని ఆన్‌లైన్ ద్వారా సభ్యత్వ నమోదును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పొల్కం వేణు, సుంకరి రంగ న్న, దొండి ఈశ్వర్, నరేష్, రాము, దీపక్, దయాసాగర్, వివేక్, తదితరులు పాల్గొన్నారు.

## ముప్కాల్‌లో సామాజిక తనిఖీ

ముప్కాల్, సెప్టెంబరు16: మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద సంబంధించిన సామాజిక తనిఖీ ప్రజా వేదిక డీఆర్‌డీవో సాయాగౌడ్ అధ్యక్షతన సోమవారం ముప్కాల్ మండల పరిషత్ ఆవరణలో నిర్వహించారు. 2023-24 సంబంధించిన ఉపాధి హామీ పథకం కింద మండలంలో జరిగిన పనులు, చెల్లింపులకు సంబంధించి గ్రామాల వారీగా ఆడిటింగ్ నిర్వహించినట్లు తెలిపారు. ప్రతీ గ్రామంలో ఉపాధి హామీ పనులు నిర్వహించిన పనిదినాలు, చెల్లింపులు, గ్రామీణ స్థాయిలో ప్రదర్శించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ ఆఫీసర్ నారాయణ, ఎంపీడీవో, ఎంపీవో, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీల్లో జిల్లా బాలికల జట్టు



రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన జిల్లా బాలికల జట్టు

డిచ్‌పల్లి, సెప్టెంబరు 16: ఈ నెల 14నుంచి 16 వరకు నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో 5వ రాష్ట్ర స్థాయి జూనియర్ బేస్ బాల్ ఛాంపియన్ షిప్ పోటీల్లో జిల్లా బాలికల జట్టు నల్గొండ జిల్లా జట్టుపై 11-0 పరుగుల తేడాతో విజయం సాధించింది. బాలుర జట్టు రాష్ట్రజట్టు 3వ స్థానం సాధించింది. జిల్లా జట్టు వరంగల్ జట్టుపై 2-1 తేడాలో విజయం సాధించి తృతీయ స్థానం సాధించినట్లు జిల్లా బేస్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, వినోద్‌లు తెలిపారు. ఈ ముగింపు కార్యక్ర మానికి శ్వేతా, మున్సిపల్ చైర్‌పర్సన్ ఈశ్వర్‌లు క్రీడాకారులకు పతకాలు అందజేశారు. పతకాలు సాధించిన క్రీడాకా రులను వ్యాయమ ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి మల్లేశ్ గౌడ్, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, మర్కంటి గంగామోహన్‌లు అభినందించారు. జిల్లా జట్టు కోచ్ మేనేజర్‌లుగా గంగా మోహన్, నరేశ్, మౌనిక, గంగాధర్‌లు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి యోగా ఛాంపియన్‌షిప్‌లో విశ్వవికాస్ విద్యార్థిని గెలుపు

నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 16: 2024-25 సంవత్సరానికి గాను రాష్ట్రస్థాయి యోగా ఛాంపియన్‌షిప్‌లో నగరంలోని గాయత్రీనగర్‌లోగల విశ్వవికాస్ పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న విద్యార్థిని దీక్షిత మొదటి స్థానంలో నిలిచింది. తెలంగాణ యోగా అసోసియేషన్ నిర్వహించిన ఈ పోటీలలో దీక్షిత ఉత్తమ ప్రతిభకనబర్చి మొదటి స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా విద్యార్థినిని మరియు శిక్షణ ఇచ్చిన కోచ్‌ను పాఠశాల కరస్పాండెంట్ అప్పారావు, ప్రిన్సిపాల్ సుస్మితలు సోమవారం అభినందించారు. యువ ప్రతిభావంతుల్ని తయారు చేసేందుకు తమ పాఠశాలలో యోగాతో పాటు క్రీడా పోటీలను నిర్వహిస్తున్నామని తద్వారా వారు శారీరకంగా, మానసికంగా ధృడంగా మారే అవకాశం ఉంటుందని ప్రిన్సిపాల్ సుస్మిత అన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

వర్ని,సెప్టెంబరు 16: వర్ని మండలం మల్లారం గండిలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మురళి(29)మృతి చెందినట్లు ఎస్ఐ కృష్ణ కుమార్ తెలిపారు. మెండోర మండలం దూద్‌గాం గ్రామానికి చెందిన మృతుడు బిచ్కుంద మండల పరిషత్ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. విధుల నిమిత్తం గల ద్విచక్ర వాహనంపై తన భార్య స్వప్నతో కలిసి వెళ్తుండగా మల్లారం గండిలో ఎదురుగా వస్తున్న డీసీఎం వాహనం ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు చెప్పారు. ప్రమాదంలో స్వప్నకు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. డీసీఎం వ్యాన్ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

## 'ఇచ్చిన హామీలు అమలు చేస్తున్న కాంగ్రెస్‌దే'

బోధన్‌రూరల్,సెప్టెంబరు 16: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని టీపీసీసీ డెలిగేట్ గంగా శంకర్ అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో పీసీసీ అధ్యక్షులుగా నియమితులైన మహేష్ కుమార్ గౌడ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీదేనన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు నాగేశ్వర్ రావు, మందర్నా రవి, పాషా మొయినోద్దీన్, హరికాంత్ చారి, తలారి నవీన్, మాజీ మున్సిపల్ చైర్మన్,కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## రాష్ట్ర బాల్ బ్యాడ్మింటన్ కార్యదర్శిగా శ్యామ్

సుభాష్‌నగర్, సెప్టెంబరు 16: రాష్ట్ర బాల్ బ్యాడ్మింటన్ సంయుక్త కార్యదర్శిగా జిల్లా బాల్ బ్యాడ్మింటన్ కార్యదర్శి బి.శ్యామ్ ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో సంయుక్త కార్యదర్శిగా శ్యామ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్‌లో ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తూ బాల్ బ్యాడ్మింటన్ క్రీడకు కృషి చేస్తున్న శ్యామ్‌ను రాష్ట్ర కార్యవర్గంలో చోటు కల్పించారు. సంయుక్త కార్యదర్శిగా ఎన్నుకోవడం పట్ల అధ్యక్షులు మానస గణేష్, క్రీడా సంఘంనాయకులు విద్యాసాగర్‌రెడ్డి, నర్సయ్య, కిషన్, రాజ్ కుమార్, రాజేశ్వర్, నాగేష్, కృష్ణమూర్తి, సురేష్‌లు హర్షం వ్యక్తం చేశారు.

## లక్ష్మీనారాయణ మందిరంలో చక్రీ భజన

పెర్కిట్, సెప్టెంబరు16: పట్టణంలోని గోల్‌బంగ్లా లక్ష్మీనారాయణ మందిరంలో సోమవారం గణేష్ ఉత్సవాల్లో భాగంగా చక్రీ భజన్ కార్య క్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పెద్దలు,యువతి,యువకులు, పిల్లలు పాల్గొని భజనలు చేస్తూతన్మయత్వం పొందారు.సనాతన ధర్మాన్ని భవిష్యత్ తరాలకు అందించేమంచి కార్యక్రమంగా భక్తులు అన్నారు.

## ఆర్థిక సహాయం అందజేత

ముప్కాల్, సెప్టెంబరు16: బాల్కొండ మండల కేంద్రానికి చెందిన జంగిడి దీక్షిత అనే చిన్నారికి గుండెలో హోల్‌పడి చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్ వైద్యఖర్చుల నిమిత్తం రూ.5వేల ఆర్థిక సహాయం కాంగ్రెస్ పార్టీ నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సునీల్ యువసేన నాయకులు, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో మిలాద్-ఉన్-నబి

● భారీ ఎత్తున ర్యాలీ ● ప్రసంగించిన మత పెద్దలు ● పోలీసుల భారీ బందోబస్తు



నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



బోధన్‌లో మిలాద్ ఉన్ నబి ర్యాలీ దృశ్యం

నిజామాబాద్ కల్చరల్, సెప్టెంబరు 16: ముస్లింలు పరమ పవిత్రంగా భావించే మిలాద్-ఉన్-నబీని భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. జిల్లా వ్యాప్తంగా ముస్లింలు మిలాద్ ఉన్ నబీని పురస్కరించుకొని ర్యాలీలు నిర్వహించారు. ఉదయం నుంచి ప్రారంభమైన ర్యాలీలు మధ్యాహ్నం వరకు సాగాయి. ర్యాలీలో ముస్లింలు మహమ్మద్ ప్రవక్తను గుర్తు చేస్తూ భక్తి గీతాలు ఆలపిస్తూ ర్యాలీని నిర్వహించారు. అనంతరం నెహ్రూ పార్క్ వద్ద ఏర్పాటు చేసిన వేదికపై మత పెద్దలు మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త (స.అ) సూచించిన విధానాలను అమలు చేయాలని తెలిపారు. ఆయన అడుగు జాడల్లో నడవాలని చెప్పారు. ప్రపంచ శాంతి కోసం మహమ్మద్ ప్రవక్త కృషి చేశారని ఆయన సేవలను కొనియాడారు. ముస్లింలు మహమ్మద్ ప్రవక్త చెప్పినటువంటి మార్గంలో నడుచుకుంటూ ప్రతీ రోజు ఐదు మార్లు నమాజ్‌తో పాటు ఖురాన్‌ను పఠించాలని సూచించారు. ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో సమస్యలు ఉన్నాయని వాటిని తీర్చడానికి ప్రతీ ముస్లిం కట్టుబడి సమస్యను తీర్చడానికి కృషి చేయాలని అన్నారు. అల్లా ప్రపంచ శాంతి కోసమే మహమ్మద్ ప్రవక్తను ఈ భూమి మీదికి పంపించాడని శాంతి, ప్రేమ, త్యాగమే ముస్లింల ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మత పెద్దలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**బోధన్‌రూరల్:** మహ్మద్ ప్రవక్త చూపిన అడుగు జాడల్లో మైనారిటీలు నడవాలని మిలాద్ ఉన్ నబి కమిటీ ప్రతినిధులు అలీమొద్దీన్ అన్నారు. సోమవారం బోధన్ పట్టణంలో మహ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా పట్టణంలోని పలు వీధుల గుండా అంబేద్కర్ చౌరస్తా వరకు మైనారిటీలు ర్యాలీ నిర్వహించారు, జలాల్ బుకారి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేసి ర్యాలీ పాత బస్టాండ్, రాకాసిపేట్, శక్కర్‌నగర్ అంబేద్కర్ చౌరస్తా వరకు కొనసాగింది. ప్రపంచ శాంతి కోసం మహ్మద్‌ప్రవక్త ఎనలేని కృషి చేశారన్నారు. ముస్లిం సోదరులకు పలువురు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన చూపిన అడుగు జాడల్లో, శాంతి సమాజ స్థాపన కోసం మైనారిటీలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు షేక్.కలీం, మొయిన్ రజా, సమీ, అది, ఖలీల్ అహ్మద్, జావీద్, తదితరులు పాల్గొన్నారు.

● పోలీసుల భారీ బందోబస్తు

మిలాద్ ఉన్ నబి ర్యాలీ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. బోధన్ ఏసీపీ శ్రీనివాస్, పట్టణ సీఐ వెంకట్ నారాయణ, కోలా నరేష్‌లు భారీ బలగాలతో మోహరించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ మిలాద్ ఉన్ నబీ, గణేష్ నిమజ్జన ఉత్సవాలను ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు.

**కోటగిరి:** కోటగిరి ఉమ్మడి మండలంలోని కోటగిరి, పొతంగల్, హంగర్గ ఫారం, జల్లాపల్లి ఫారం గ్రామాలలో సోమవారం మిలాద్ ఉన్ నబీ ఉత్సవాలను ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గ్రామాలలో పెద్ద ఎత్తున ర్యాలీలు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

**డిచ్‌పల్లి:** మిలాద్-ఉన్-నబి పురస్కరించుకొని సోమవారం ఇస్లాంపూర్ మసీద్ నుంచి మైనార్టీ సోదరులు శాంతి ర్యాలీ నిర్వహించారు. మౌలాన మోసీన్‌రజా ప్రత్యేక ప్రార్థనాలు చేసి ఈ ర్యాలీ ప్రారంభించారు. మహమ్మద్ ప్రవక్త శాంతి సందేశాన్ని గుర్తు చేస్తూ మైనార్టీలు ప్రార్థనాలు నిర్వహించారు. నడిపల్లి, గాంధీనగర్, మీదుగా ర్యాలీ కొనసాగింది ఈ ర్యాలీలో మైనార్టీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ ర్యాలీకి సీఐ మల్లేశ్ ఎస్సై షరీఫ్‌లు దగ్గరుంచి భద్రత ఏర్పాట్లు పర్యవేక్షించారు.

**రుద్రూరు:** మహ్మద్ ప్రవక్త పుట్టిన రోజును పురస్కరించుకుని సోమవారం రుద్రూరు మండల కేంద్రంతో పాటు అక్బర్‌నగర్, సులేమాన్‌నగర్ తదితర గ్రామాల్లో ముస్లిం సోదరులు మిలాద్ ఉన్ నబీ వేడుకలను భక్తి శ్రద్దలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా మజీద్‌లలో ప్రత్యేక ప్రార్థనలు చేసి పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ముస్లిం సోదరులకు పలువురు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అదే విధంగా ముస్లింలు ర్యాలీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమాలలో ముస్లిం ప్రముఖులు మహ్మద్ జహారా, మహ్మద్ యూనూస్, ఆరిఫ్, ఖురేషి, షేక్ నిస్సార్, సుబాని, సయ్యద్ తదితర ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు: అన్వేష్‌రెడ్డి



వరి పంటను పరిశీలిస్తున్న రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి

జక్రాన్‌పల్లి, సెప్టెంబరు16: నసిరకం నాణ్యత లేని నకిలీ విత్తనాలు అమ్మిన, ప్రైవేటు సీడ్ సంస్థల కంపెనీలపై కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం జక్రాన్‌పల్లిలో రైతులు సాగు చేస్తున్న గింజలు రాని వరి పంటను ఆయన పరిశీలించారు. జక్రాన్‌పల్లి మండలంలో భోజారెడ్డి, ముత్తెన్న, మరికొంత మంది రైతులు సాగు చేస్తున్న మహేంద్ర అండ్ మహేంద్ర ప్రైవేటు సీడ్ కంపెనీ యాజమాన్యం మండలంలో సుమారు 500 ఎకరాలకు మహేంద్ర అండ్ మహేంద్ర సీడ్ కంపెనీ వారు ఈ వరి విత్తనాలు ఇచ్చారన్నారని రైతులు తెలిపారన్నారు. ప్రస్తుతం వరి పంట పెరిగిందని, కానీ ధాన్యం గింజలు రాలేదని, దీంతో రైతులు పంట నష్టపోయమని రైతులు తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. ఈ మేరకు రైతుల కోరిక మేరకు మంగళవారం రైతులు సాగు చేస్తున్న ఈ కంపెనీ ఇచ్చిన వరి పంటను పరిశీలించనున్నారు. విత్తనల చట్టంలో మార్పులు రావాలన్నారు. కఠినమైన నిబంధనలు రావాలన్నారు. నాసిరకం, నాణ్యత లేని నకిలీ విత్తనాలు అమ్మిన సీడ్ కంపెనీలపై కఠిన చర్యలు తప్పవన్నారు. రైతులు విత్తనాలు కొనే ముందు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రైవేటు కంపెనీల వారు రైతులను బుజ్జగించి మోసం చేస్తున్నారని, ప్రైవేటు కంపెనీల వారు ఇచ్చే విత్తనాలను ప్రభుత్వం ధ్రువీకరించడంలేదన్నారు. రైతులు ప్రైవేటు కంపెనీ ద్వారా కాకుండా ప్రభుత్వం విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా రైతులు విత్తనాలు కొనుగోలు చేసుకొని పంటలను సాగు చేసుకోవాలన్నారు. మంగళవారం జక్రాన్‌పల్లి వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు కలిసి రైతులు పండిస్తున్న మహేంద్ర అండ్ మహేంద్ర సీడ్ కంపెనీ వారు ఇచ్చిన వరి పంటను పరిశీలిస్తారన్నారు. అధికారులు పరిశీలించిన తర్వాత నాణ్యత లేదని తెలితే ఆ కంపెనీపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆ కంపెనీ ద్వారా రైతులకు పరిహారం ఇప్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిన్నారెడ్డి, మండల ప్రధానకార్యదర్శి వసంత్‌రావు, మండల యువజన విభాగం అధ్యక్షుడు వినోద్, అర్గుల్, బ్రాహ్మణపల్లి సింగిల్‌విండోల చైర్మన్‌లు ఆర్మూర్ గంగారెడ్డి, కాటపల్లి నర్సారెడ్డి, ఏడీ ప్రదీప్‌రెడ్డి, వ్యవసాయాధికారిణి దేవిక, కాంగ్రెస్ నాయకులు రూపాల గంగారెడ్డి, కుంట భోజన్న, కాటపల్లి నర్సారెడ్డి, జితేందర్‌నాయక్, బాలయ్య రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## ముప్కాల్‌లో సినిమా షూటింగ్ సందడి



ముప్కాల్‌లో షూటింగ్ తీస్తున్న దృశ్యం

ముప్కాల్, సెప్టెంబరు16: ముప్కాల్ మండల కేంద్రంలో గ్యాంగ్ ఆఫ్ గోపాల్‌పేట్ అనే చిత్రం షూటింగ్ జిల్లా టీయు యుటీఎఫ్ ప్రధానకార్యదర్శి రమేష్ క్లాప్ కొట్టి ప్రారంభించారు. సోమవారం ముప్కాల్‌లోని పడిలేచిన మర్రి చెట్టు దేవస్థానం వద్ద రీల్ రియల్‌మూవీ క్రియేషన్ చిత్రనిర్మాణ సారథ్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ చిత్ర నిర్మాణానికి ప్రముఖ తెలంగాణ గేయ రచయిత కోడాడి శ్రీనివాస్ సంగీత దర్శకత్వం వహిస్తున్నా రని, చిత్ర దర్శకుడు మధు, నూతన నటినటులతో గ్రామీణ ప్రాంతాల్లో యువతకు స్ఫూర్తిగా నిలిచే కథతో సినిమా తీస్తున్నట్లు వారు తెలిపారు. ఈ చిత్రపటాన్ని బాల్కొండ, ముప్కాల్ మండలల్లోని గ్రామీణ ప్రాంతాల్లో చిత్ర షూటింగ్ నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో నిర్మాత సి. పణీంద్ర, అసోసియేషన్ డైరెక్టర్ సంగిరేపాండురంగ, బుక్ డిపో, రామ్‌రాజ్ ఉమేష్, శీను, దశరథ్, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ నిమజ్జనోత్సవాన్ని శాంతియుతంగా జరుపుకోవాలి

ముప్కాల్, సెప్టెంబరు16: గణేష్‌మండపాల్లో 11రోజులు పూజలందు కుచున్న గణనాథులను నిమజ్జనోత్సవ కార్యక్రమం శాంతియుతంగా జరుపుకో వాలని ఎస్సై బి.నరేష్ తెలిపారు. సోమవారం బాల్కొండ పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన శాంతి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గణేష్ నిమజ్జనంలో భాగంగా అధిక సౌండ్‌లకు డీజే లకు అనుమతి లేదని, గణేష్ నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు వారు తెలిపారు. పోలీస్ బందోబస్తుతో నిర్వహించే నిమజ్జనోత్సవం ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగ కుండా నిర్వహించాలని సూచించారు. ఎలాంటి సమస్యలు ఎదురైనా చట్టపర మైన చర్యలు తీసుకోబడుతాయని అన్నారు. ఈ సమావేశంలో గణేష్ మండపాల నిర్వాహకులు, యువకులు, యువజన సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## అశోక్ కుటుంబానికి అండగా ఉంటాం

● రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్‌లు అనిల్, మోహన్‌రెడ్డి

మెండోర, సెప్టెంబరు16: అశోక్ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్‌లు ఈరవత్రి అనిల్, మానాల మోహన్ రెడ్డిలు అశోక్ కుటుంబసభ్యులకు ధైర్యామిచ్చారు. సోమవారం మండల కేంద్రానికి చెందిన గాండ్ల అశోక్ ఇటీవల ప్రమాదవశాత్తు కాకతీయ కాలువలో పడి మృతి చెందడంతో వారి కుటుంబసభ్యులను రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్, మానాల మోహన్‌లు పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీలో అశోక్ చురుకుగా పాల్గొనేవాడని, అశోక్ కుటుంబానికి అండగా ఉంటామని అధైర్యపడవద్దని కుటుంబసభ్యులను ఓదార్చారు. వీరి వెంట మండల అధ్యక్షుడు కొత్తింటి ముత్యంరెడ్డి, వెంకటేష్‌గౌడ్, ముత్యం రెడ్డి, తదితరులు ఉన్నారు.

## ఫిలిప్పీన్‌లో వేల్పూర్ యువకుడి మృతి



మృతుడు అక్షయ్

వేల్పూర్, సెప్టెంబరు16: ఫిలిప్పీన్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో వేల్పూర్ మండలానికి చెందిన అక్షయ్ మృతి చెందాడు. అక్షయ్ ఫిలిప్పీన్‌లో ఎంబీబీఎస్ చివరి సంవత్సరం చదువుతున్నాడు. మరో ఐదు నెలలో ఎంబీబీఎస్ పూర్తి కావస్తున్న సమయంలో అక్షయ్ ఆకస్మిక మృతి అతని కుటుంబంలోని తీవ్ర విషాదాన్ని నింపింది. కాగా గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి.

## పచ్చని చెట్లు నేలమట్టం



బడాభీమ్‌గల్ శివారులో విద్యుత్ అధికారులు నరికివేసిన పచ్చని చెట్లు

భీమ్‌గల్‌రూరల్, సెప్టెంబరు16: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటడానికి కోట్లది రూపాయల నిధులు విడుదల చేసి చెట్లు నాటిస్తే వాటిని విద్యుత్ శాఖ అధి కారులు కరెంటు తీగలకు తగులుతున్నాయని నరికివేసుతన్నారు. సోమవారం మండలంలోని బడాభీమ్‌గల్ గ్రామ శివారులో చేంగల్ రోడ్డుకు కొత్తగా కరెంటు స్తంభాలు ఏర్పాటు చేశారు. వాటికి కరెంటు తీగలు లాగడానికి పచ్చని చెట్లు అడ్డువస్తున్నాయని వాటిని విద్యుత్ అధికారులు నరికివేస్తున్నారు. దీనిపై పంచాయతీకార్యదర్శి రజితను వివరణ కోరగా మే ము పంచాయతీ నుంచి ఎటువంటి అనుమతి ఇవ్వలేదన్నారు. రూ.కోట్లు ఖర్చు పెట్టి చెట్లు నాటారు ఎందుకు తర్వాత వాటిని నరకడం ఎందుకాని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పచ్చని చెట్లను నేలమట్టం చేస్తున్న వారిపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో చూడాలి.

## ఆటో బోల్తా బాలుడి మృతి



సంతోష్‌నగర్‌తండా వద్ద బోల్తా పడ్డ ఆటో

భీమ్‌గల్‌రూరల్, సెప్టెంబరు16: మండలంలోని సంతోష్‌నగర్‌తాండా గ్రామ పంచాయతీ పరిధిలో ఆటో బోల్తా పడి సయ్యద్ రియస్(9) బాలుడు మృతి చెందినట్లు ఎస్సై మహేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకా రం సోమవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో డ్రైవర ఆటో భీమ్‌గల్ నుంచి ఐదుగురిని ఎక్కించుకొని కేసీఆర్ కాలనీకి వెళ్తుండగా ఈ దుర్ఘటన జరిగింది. ఆటోలో ప్రయాణిస్తున్న బేగం చేతికి గాయాలు అయ్యాయి. మృతుని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకే కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

## సాయుధ పోరాటం కమ్యూనిస్టుల పోరాటమే

పెద్దబజార్, సెప్టెంబరు 16:స్వతంత్ర్య భారతదేశంలో తెలంగాణను కలపాలని సం కల్పంతో నాడు చేసిన సాయుధ పోరాటం కమ్యూనిస్టుల పోరాటమని కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ మార్క్సిస్టు రాష్ట్ర కమిటీ సభ్యులు భోపాల్, రమ అన్నారు. సోమవారం నాం దేవ్‌వాడలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సిపిఎం అఖిల భారత జాతీయ కార్యదర్శి సీతారం ఏచూరి సంతాప సభలో ఆయన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటాలను కమ్యూనిస్టులు చేసిన పోరాటంగా ఆయన అభివర్ణించారు. బీజేపీ హిందు, ముస్లింల మధ్య గొడవలకు ఆజ్యం పోయడం మానుకోవాలని అన్నారు.ఈకార్యక్రమంలో సభ్యులు నూర్జహాన్, శంకర్, సా హెబ్, సుజాత, నాగేశ్వర్‌రావు, నారాయణ, రాములు తదితరులు పాల్గొన్నారు.

## వినాయక ఉత్సవాలకు సహకారం



భీమ్‌గల్‌లో మహమ్మద్ ఇక్రమ్‌అలీ సన్మానిస్తున్న నిర్వహణ సభ్యులు

భీమగల్, సెప్టెంబరు16: పట్టణ కేంద్రానికి చెందిన మహమ్మద్ ఇక్రమ్‌అలీ అనే ముస్లిం యువకుడు గణేష్ ఉత్సవాలలో అన్నదానానికి తనవంతు సహాయం చేసి మతసామరస్యానికి ప్రత్యేకగా నిలిచారు. పట్టణ కేంద్రంలోని బోదిరెగల్లీలో మున్నూరుకాపు యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్టించిన వినాయక మండపం వద్ద సోమవారం ఏర్పాటు చేసిన అన్నదానానికి ముస్లిం యువకుడు రూ.5వేలు అందజేశారు. ఈ సందర్భంగా యూత్ సభ్యులు మహమ్మద్ ఇక్రమ్‌అలీని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బోదిరె నర్సయ్య, పట్టణ యూత్ అధ్యక్షుడు నీలం రవి, సుమన్, నరేష్, గంగాధర్, యూత్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్కెస్ట్రా నిర్వహణపై పోలీసుల సీరియస్

● రుద్రూరులో పది మందిపై కేసు నమోదు

రుద్రూరు, సెప్టెంబరు 16: ఎలాంటి అనుమతులు లేకుండా ఆర్కెస్ట్రా నిర్వహిం చడం పట్ల పోలీసులు సీరియస్ అయ్యారు. ఆదివారం రాత్రి రుద్రూరులో ఆర్కెస్ట్రా కొనసాగుతుందని సమాచారం రావడంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి నిలిపివేయిం చారు. రుద్రూరు మండల కేంద్రంలో పది మందిపై కేసు నమోదు చేశారు. అనుమ తులు లేకుండా ఆర్కెస్ట్రా,రికార్డింగ్ డ్యాన్సులు నిర్వహించార న్నారు. వీరిపై కేసు నమో దు చేసినట్లు ఎస్సై సాయన్న తెలిపారు. అశ్లీల నృత్యాలు చేస్తూ అసభ్యంగా రికార్డింగ్ డ్యాన్సులు చేసినట్లు తెలిసింది.ఈ విషయమై ఎస్సై వివరణ కోరగా మరోసారి ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా చూస్తామని తెలిపారు. అనుమతులు లేకుండాఎవరైనా ఎక్కడైనా ఆర్కెస్ట్రాలను ఏర్పాటు చేస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ సాయన్న పేర్కొన్నారు. నిమజ్జనోత్సవాలను పకడ్బందీగా నిర్వహిస్తున్నామన్నారు

## కందకుర్తిలో సోయాపంట పరిశీలన



సోయాపంటను పరిశీలిస్తున్న దృశ్యం

రెంజల్,సెప్టెంబరు 16: మండలంలోని కందకుర్తి గ్రామంలో రైతులు పండించిన సోయాపంటను సోమవారం హైదరాబాద్‌కు చెందిన కలాంతన్ అగ్రికల్చర్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన శాస్త్రవేత్తలు పరిశీలించారు. భారత దేశంలో ఉన్న 22రకాల సోయాబీన్ పంటలను కందకుర్తి గ్రామంలో రైతులు పండించడం జరిగిందని వాటిని పరిశీలించడం జరిగిందని వారన్నారు. 22రకాల సోయాబీన్ పంట రకాలు బాగున్నాయని, వీటి ద్వారా పంట దిగుబడి అధికంగా వస్తుండడంతో రైతులకు అందించే ఉద్దేశంతో డెమో ద్వారా పంటను పరిశీలించడం జరిగిందని రానున్న రోజుల్లో ప్రతి రైతుకు ఈ విత్తనాలు అందించడం జరుగుతుందని అన్నారు ఈ కార్యక్రమంలో ఉస్మాన్, సంజీవ్‌రెడ్డి, షోయబ్ బేగ్‌కలీముల్లా హుస్సేన్, హసినోద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ

ఎడపల్లి, సెప్టెంబర్16: ఎడపల్లి మండలంలోని కు ర్నాపల్లి గ్రామ బీఆర్‌ఎస్ నా యకుడు మాజీ సర్పంచ్ సావిత్రి రవీందర్‌గౌడ్ భర్త రవీందర్‌గౌడ్ గత కొన్ని రోజుల క్రితం స్వాతంత్ర్యదినోత్సవ వేడుకల్లో భాగంగా విగ్రహానికి పూలమాల వేస్తూ ప్రమాదవశాతు క్రింద పడడంతో గాయపడి చికిత్స పొందుతున్నాడు. సోమవారం మాజీ ఎమ్మెల్సీ విజి గౌడ్ అతనిని ఆయన నివాసంలో పరామర్శించి వివరాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అయనవెంట గౌడ సంఘం నాయకులు రాజాగౌడ్, మధుసూదన్ గౌడ్, శ్రీహరి గౌడ్, ఉత్తమ్ గౌడ్, ఎల్లా గౌడ్, నటరాజ్ గౌడ్ తదితరులు ఉన్నారు.

## విద్యుత్ సమస్యలు ఉంటే తక్షణమే సమాచారం ఇవ్వాలి



విద్యుత్ చిహ్నం గల టీషర్టులను ఆవిష్కరిస్తున్న ఏడీఈ, ఏఈలు

ఆర్మూర్‌టౌన్,సెప్టెంబరు16: నేడు పట్టణంలో జరిగే గణేష్ నిమజ్జన కార్యక్రమంలో విద్యుత్ సమస్యలు ఉంటే తక్షణమే సమా చారం అందించాలని విద్యుత్ ఏడీఈ శ్రీధర్, ఏఈ ఆశ్రితరెడ్డిలు తెలి పారు.ఈ సందర్భంగా విద్యుత్ అధికారులకు టీజీఎన్‌పీడీసీఎల్ చిహ్నం గల వైట్‌కలర్ టీషర్టును సోమవారం వారు ఆవిష్కరించారు. ప్రతీ ఉద్యోగి ఈ టీషర్టును ధరించడంతో సులువుగా తెలుస్తుందని తెలిపారు. పాత ఆర్మూర్‌కు లైన్ ఇన్‌స్పెక్టర్ రవీందర్ సెల్.9493546612, కొత్త ఆర్మూర్‌కు సీతరాములు 9848327500, గోల్‌బంగ్లా నుంచి కాశీహన్మాన్ వీధి వరకు ఎల్లయ్య 9550059915, హుస్నాబాద్, చిన్నబజార్, గొమ్ముల వాడ, అరుంధతినగర్‌కు హజర్ 8333994759, రాంనగర్, జిరాయత్ నగర్, శాస్త్రీనగర్‌కు ప్రభాకర్ 9010931869, గాంధీరోడ్, న్యూబస్టాండ్, మహాలక్ష్మీకాలనీకి సంతోష్ 888600 3779, రాజారాంనగర్, యోగేశ్వర కాలనీ, సైదాబాద్, టీచర్స్‌కాలనీలకు రమేష్ 8074415490, హౌసింగ్ బోర్డు, సంతోష్‌నగర్, ఒడ్డెరకాలనీ, రంగచారినగర్‌కు రాంచందర్ 8339 94758, గూండ్ల చెరువు వద్ద బాబుఫరావు 9493546615 నెంబర్‌లను సంప్రదించాలని వారు తెలిపారు.

## పీఆర్టీయూ జిల్లా కార్యదర్శిగా గంగాధర్



గంగాధర్

ఏర్గట్ల,సెప్టెంబరు16: మండల కేంద్రంలోని ప్రాథమి క పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు సాధుల గం గాధర్ పీఆర్టీయూ జిల్లా కార్య దర్శిగా ఎన్నికైనట్లు పీ ఆర్టీయూ మండల అధ్యక్షుడు కృష్ణప్రసాద్, ప్రధాన కార్యదర్శి రాజేఖర్‌లు తెలిపారు. జిల్లాలో నిర్వహించిన ఎన్నికల్లో 133ఓట్ల భారీ మెజార్టీతో గంగాధర్ గెలు పొందగా, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు దామోందర్, రాష్ట్ర ఉ పాధ్యక్షుడు భాస్కర్, రాష్ట్రకార్యదర్శిలు అభినందనలు తెలిపారు.

## వినాయక నిమజ్జనం ఏర్పాట్ల పరిశీలన

భీమ్‌గల్, సెప్టెంబరు16: భీమ్‌గల్ పట్టణంలోని వినాయక ఉత్సవాల సందర్భంగా విగ్రహాల నిమజ్జనం చేసే చెరువులను సోమవారం మున్సిపల్ కమిషనర్ వై.రామకృష్ణ చైర్మన్ కన్నె ప్రేమలత సురేందర్, సీఐ నవీన్‌కుమార్‌లు పరిశీలించారు. నిమజ్జనం చేసే చెరువు వద్ద తీసుకోవాల్సి జాగ్రత్తలను సిబ్బందికి వివరించారు. చెరువు ప్రాంతంలో లైట్లు ఏర్పాటుతో పాటు గజ ఈతగాళ్లు నియామిస్తున్నామని, భారీ విగ్రహాల కోసం క్రేన్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఉత్సవాల్లో ఎలాంటి ప్రమాదాలు వాటిల్లకుండా ఉండేలా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వీరి వెంట విద్యుత్ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది శ్రీనివాస్‌రెడ్డి, పల్లికొండ శ్రీధర్, సున్నపు ఓంకార్ ఉన్నారు.



హోమం నిర్వహిస్తున్న దృశ్యం

## సిద్దరామేశ్వరనగర్‌లో హోమం

భిక్కనూరు, సెప్టెంబరు16: మండలంలోని సిద్దరామేశ్వరనగర్ గ్రామంలో హిందు సేనా యూత్ క్లబ్ ఆధ్వర్యంలో గణేష్ మండపం ఎదుట లోక కళ్యాణార్థం హోమ కార్యక్రమాన్ని వేదబ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల నడుమ సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణనాథుడిని తీరొక్క పూలతో ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ మేరకు యూత్‌క్లబ్ సభ్యులు మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం తమ గణేష్ మండపం ఎదుట లోకకళ్యాణార్థం హోమకార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. సాయంత్రం గణేష్ మండపం ఎదుట పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆలయానికి వెండి శఠగోపం బహూకరణ



సిద్ధరామేశ్వర ఆలయంలో శఠగోపం బహూకరిస్తున్న దృశ్యం

భిక్కనూరు, సెప్టెంబరు 16: మండలకేంద్రంలోని దక్షిణకాశీగా బాసిల్లుతున్న శ్రీసిద్ధరామేశ్వర ఆలయంలో మాతా భువనేశ్వరి ఆలయానికి హైదరాబాద్‌కు చెందిన వరలక్ష్మీ-వెంకటేష్ దంపతులు వెండి శఠగోపాన్ని సోమవారం అందజేసినట్లు ఆలయ ఈవో శ్రీధర్ తెలిపారు. ఈ సందర్భంగా దాత కుటుంబ సభ్యులను ఆలయ సిబ్బంది సన్మానించి స్వామివారి చిత్రపటాన్ని లడ్డూప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో మద్ది చంద్రకాంత్ రెడ్డి, మద్ది శ్యామల, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నటేశ్వర శర్మకు ఘన నివాళి

కామారెడ్డిటౌన్, సెప్టెంబరు16: అనంతమైన ప్రజ్ఞానానికి సాహితీ స్రష్ట అయాచితం నటేశ్వర శర్మ అని మల్లినాథసూరి కళాపీఠం ఏడుపాయల సంస్థాన్ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు అమరకుల చక్రవర్తి అన్నారు. సోమవారం కామారెడ్డి జిల్లాకేంద్రంలోని వశిష్ఠ డిగ్రీ కళాశాలలో అయాచితం చిత్రపటం వద్ద నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నటేశ్వరశర్మ సమాజానికిచేసిన సాహిత్య సేవలు అమూల్యమైనవని అన్నారు. ఆధ్యాత్మిక, సాంస్కృతిక సామాజిక కళా పరమైన సేవలు అద్భుతమైనవని అన్నారు. అంతర్యామి దృష్టిలో రచనలు చేసిన ఘనత వారిదేనని అన్నారు. వారి అకాలమరణం సాహిత్య లోకానికి తీరని లోటని అన్నారు. వివిధసామాజిక సాహిత్య స్పృహ సేవలు చిరస్మరణీయమని అన్నారు. కార్యక్రమంలో పురాణ శుకకవి బ్రహ్మ వి.వెంకట్ కామారెడ్డి కళాపీఠం జిల్లా అధ్యక్షుడు మారబాల్‌రెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శి విజయశ్రీ తదితరులు పాల్గొన్నారు.



నటేశ్వర శర్మ చిత్రపటం వద్ద నివాళ్లు అర్పిస్తున్న దృశ్యం





దోమకొండలో నిమజ్జనంలో యువకులు



రామారెడ్డి చెరువులో వినాయకులను నిమజ్జనం చేస్తున్న దృశ్యం



చెరువు వద్ద నిమజ్జనాన్ని తిలకిస్తున్న గ్రామస్థులు

# ఉత్సాహంగా వినాయక నిమజ్జన శోభాయాత్ర

గాంధారి, సెప్టెంబరు16: గాంధారి మండలకేంద్రంలో వినాయకనిమజ్జన శోభాయాత్ర సోమవారం ఘనంగా నిర్వహించారు. మండలకేంద్రంలోని అన్ని వినాయక విగ్రహాలనుప్రధాన వీధుల గుండా ఊరేగింపు నిర్వహించి బ్యాండ్ చప్పుళతో నృత్యాలు చేస్తు చెరువులో నిమజ్జన కార్యక్రమాలు చేపట్టారు. ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా ఎస్సై ఆంజనేయులు బందోబస్తు కార్యక్రమాలు నిర్వహించారు.

### భిక్కనూరులో..

భిక్కనూరు: మండలకేంద్రంతో పాటుగా మండలంలోని ఆయాగ్రామాల్లో గణేష్ నిమజ్జన కార్యక్రమం కొనసాగుతుంది. ఈ సందర్భంగా ఆయాగ్రామాల్లో గణనాథులను ప్రత్యేక వాహనాల్లో పెట్టి బ్యాండ్, సౌండ్స్ బ్యాండ్‌ల నడుమ ప్రధాన వీధులగుండా ఊరేగింపు నిర్వహించి స్థానిక చెరువు, కుంటల్లో గణనాథులను నిమజ్జనం చేశారు. భిక్కనూరు మండల కేంద్రంలోని విజ్ఞాన్ పాఠశాలలో ప్రతిష్ఠించిన గణనాథుడి నిమజ్జనం కార్యక్రమంలో భాగంగా మండలకేంద్రంలోని ప్రధానవీధుల గుండా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాల నడుమ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ విజయ్‌భాస్కర్, ఉపాధ్యాయులు, ఆయాగ్రామాల యువజన సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

### దోమకొండలో..

దోమకొండ: దోమకొండ, బీబీపేట మండలాల్లో సోమవారం గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణనాథులను యువజన సంఘాల సభ్యులు ప్రత్యేక వాహనాల్లో పెట్టి విద్యుత్ దీపాలతో అలంకరించి ప్రధాన వీధుల గుండా యువతీయువకుల నృత్యాల నడుమ నృత్యాలు చేస్తూ ఊరేగింపు నిర్వహించి స్థానిక చెరువు, కుంటల్లో నిమజ్జనం చేశారు. ఈ మేరకు ఎలాంటి సంఘటనలు చోటుచేసుకుండా ఎస్సై ఆంజనేయులు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

### రామారెడ్డిలో..

రామారెడ్డి: రామారెడ్డి మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాలలో నిమజ్జన కార్యక్రమాలు ఘనంగా కొనసాగాయి. యువకులు నృత్యాలు చేస్తు వినాయక విగ్రహాలను గంగమ్మ ఒడికి చేర్చారు. ఎలాంటి అవాంచనీయ ఘటనలు చేటుచేసుకోకుండా ఎస్సై నరేష్ గౌడ్ ఆధ్వర్యంలో పోలీసుబందోబస్తు నిర్వహించారు.

### పెద్దకొడప్‌గల్‌లో..

పెద్దకొడప్‌గల్: మండలంలోని ఆయా గ్రామాలలో గణేషుని నవరాత్రి వేడుకల సందర్భంగా 9 రోజులు పాటు వేడుకలు పూర్తికావడంతో సోమవారం ఆయా గ్రామాలలోని గణనాథులు నిమజ్జనానికి తరలాయి. 9 వేడుకలు పూర్తి కావడంతో ఆయా గ్రామాలలో యువతతోపాటు గ్రామస్థులు గణనాథులను స్థానికంగా ఉన్న చెరువులలోకి నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా గణనాథుల ముందు మహిళలు కోలాటలతోపాటు డీజే పాటలకు అనుగుణంగా జానపదాలకు అనుగుణంగా నృత్యాలుచేశారు. ఇక యువకులు డీజే పాటలతోపాటు ఇతర పాటలకు ఆటలు ఆడారు. మొత్తంమీద వారంరోజులపాటు భక్తితో గణపయ్యలను పూజించి తిరిగి మళ్లీ సంవత్సరం రావాలంటూ మొక్కులు తీర్చుకున్నారు.

### రికార్డుస్థాయిలో లడ్డూ వేలంపాట

అంతకుముందు మండలంలోని ఆయా గ్రామాలలో గణపతుల లడ్డూ వేలం పాట నిర్వహించగా కాటేపల్లి తండాలో లడ్డూ వేలంపాట పాడగా తండాకు చెందిన బామన్ బీక్యానాయక్ రూ.83వేల 101కు లడ్డూను స్వంతంచేసుకున్నాడు. ఇకఇదే తండాలో గణేషుని మెడలో వేసిన రూ.100 దండను 66వేల 100 బామన్ గర్దాస్ సొంతంచేసుకున్నారు. వీటిని పాటుగా వివిధ రకాల వస్తువులను తండా గణేషుని వద్ద వేలంపాట నిర్వహించగా మొత్తం అన్ని వస్తువులు కలిపి రూ. 2,04,500 వేలం పాటలో ధర పలికాయి.

### బీర్కూర్‌లో..

బీర్కూర్: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా సోమవారం బీర్కూర్ మండలంలోని గణేష్ విగ్రహాల నిమజ్జన కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా మండపాల వద్ద గణనాథులకు భక్తులు ప్రత్యేకపూజలు నిర్వహించి ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. మండలంలో దాదాపు వందకుపైగా వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు. మండలంలోని ఆయా గ్రామాల్లో వాగులు, వంకలు, కుంటలు, చెరువుల్లో గణపయ్య విగ్రహాలను నిమజ్జనం చేశారు. నిమజ్జన కార్యక్రమాన్ని మండపాల నిర్వాహకులు కొబ్బరికాయలు కొట్టిప్రారంభించారు. నిమజ్జన ఊరేగింపు అట్టహాసంగా ప్రారంభమైంది. ఉదయం 11గంటలకు విగ్రహాల ఊరేగింపు ప్రారంభం అవ్వగా అర్ధరాత్రి దాటాక నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు పకడ్బందీ చర్యలు తీసుకున్నారు.

### లింగంపేటలో..

లింగంపేట: మండలంలోని పలు గ్రామాలతో పాటు లింగంపేట మండల కేంద్రంలో వినాయకుని నిమజ్జన ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. శోభాయాత్ర కోసం వాహనాలను అందంగా ముస్తాబు చేశారు. డీజేలు, బ్యాండ్‌లు, డప్పువాయిద్యాలు, ఇతర నృత్యాలతో భక్తులు హుషారుగా పాల్గొన్నారు. మంగళవారం రాత్రి వరకు శోభాయాత్ర కొనసాగుతుందని భక్తులు తెలిపారు. వినాయక మండపాల వద్ద గణపతి చేతిలోని లడ్డూ వేలానికి భక్తులు తీవ్రంగా పోటీ పడి లడ్డును దక్కించుకున్నారు. మండలంలోని ముంబాజీపేట తండా మాజీ సర్పంచ్ బల్‌రాం నాయక్ రూ.25100, లింగంపేటలో రూ.31వేయికి, సురాయిపల్లిలో 21వేయికి, పొల్కంపేట, భవానిపేటలతో పాటు పలు గ్రామాలలో లడ్డూ వేలం పాటలో పోటీ పడి లడ్డును దక్కించుకున్నారు. ఈసందర్భంగా ఎస్సై అరుణ్‌కుమార్ నిమజ్జన శోభాయాత్రను శాంతియుతంగా, భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని, మద్యం సేవించి ఇతరులకు ఇబ్బందులు కలిగించవద్దని ఆయన తెలియజేశారు.

### నిమజ్జన కార్యక్రమాలలో పాల్గొనే సిబ్బందికి వస్తువుల పంపిణీ

కామారెడ్డిటౌన్: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని నిమజ్జన ఉత్సవాలలో పాల్గొనే పారిశుద్ధ్య సిబ్బందికి సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ చంద్రశేఖర్‌రెడ్డి వస్తువులను పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెరువు వద్ద విధులు నిర్వహించే సిబ్బందికి రేడియం జాకెట్, నైలాన్‌గ్లోవ్స్, స్విమ్మింగ్ ట్యూబ్స్, నైలాన్‌రోప్, ఆప్రాన్స్ లైఫ్‌జాకెట్ వస్తువులను పంపిణీచేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ సుజాత, పట్టణ కౌన్సిలర్‌లు తదితరులు పాల్గొన్నారు.



బీర్కూర్‌లో శోభాయాత్ర నిర్వహిస్తూ..



బేగంపూర్ గ్రామంలో నృత్యాలు చేస్తున్న మహిళలు



కార్మికులకు వస్తువులను పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్

# భక్తిశ్రద్ధలతో మిలాద్-ఉన్-నబీ



నాగిరెడ్డిపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



ఎస్సైని సన్మానిస్తున్న మైనారిటీలు

పెద్దకొడప్‌గల్, సెప్టెంబరు 16: జుక్కల్ మండలంలో మహ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలను ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా గ్రామంలోని వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మైనారిటీలు మాట్లాడుతూ గతంలో ఆడపిల్లలు పుడితే చంపివేసేవారని, మహ్మద్ ప్రవక్త పుట్టిన తర్వాత ఆడపిల్లలను మనతో పాటే పెరగనిద్దాం అన్న పిలుపుతో అందరినీ మార్పివేశారని తెలిపారు. దీంతో పాటుగానే అనాథ పిల్లలను ఆదుకోవడంతో పాటు, తల్లిదండ్రులకు సేవచేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్సైకి ముస్లింలు శాలువా పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు షకీల్ రజా, కరీం, ఫిర్దోస్, షైబూబ్ వజీత్, వరూక్, సమీర్, జలీల్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అజయ్ పాల్గొన్నారు.



నినాదాలు చేస్తూ వెళ్తున్న దృశ్యం

### నాగిరెడ్డిపేటలో

నాగిరెడ్డిపేట: మహ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా మిలాద్ ఉన్ నబీ ఉత్సవాన్ని మండల కేంద్రంలో ముస్లింలు సోమవారం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని ముస్లింలు ఆదివారం రాత్రి మసీదుల్లో జాగరణ చేసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సోమవారం ఉదయం నాగిరెడ్డిపేట, గోపాల్‌పేట గ్రామాలకు చెందిన ముస్లింలు మండలకేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మతపెద్దలు, ముస్లిం లు పాల్గొన్నారు.

### ముస్లింల శాంతి ర్యాలీ

ఎల్లారెడ్డి: ముస్లింలు పవిత్రంగా జరుపుకునే మహ్మద్ ప్రవక్త పుట్టిన రోజు ఈద్ మిలాద్ ఉన్ నబీ పండుగ సోమవారం ఎల్లారెడ్డి డివిజన్ కేంద్రంలో ముస్లింలు జరుపుకున్నారు. ముస్లింలు ఎల్లారెడ్డిలో ఉస్మానియా మజీద్ వరకు భారీ శాంతి ర్యాలీ నిర్వహించారు. మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ర్యాలీలో ముస్లిం పెద్దలు గయాజుద్దీన్, షేకావత్, గఫర్, మజీద్ వందల సంఖ్యలో పాల్గొన్నారు. ఎస్సై గణేష్ ర్యాలీకి బందోబస్తు నిర్వహించారు.

## నేడు బాన్సువాడలో గణేష్ నిమజ్జనం

బాన్సువాడటౌన్, సెప్టెంబరు16: పదకొండు రోజుల పాటు పూజలందుకున్న గణనాథుడి నిమజ్జనం కార్యక్రమం మంగళవారం జరగనుంది. బాన్సువాడ పట్టణంలోని కల్కి చెరువు వద్ద నిమజ్జనం జరిపేందుకు అధికారులు, మున్సిపల్ పాలకవర్గం ఏర్పాట్లను చేశారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భారీ భద్రత ఏర్పాట్లను చేశారు.

## గణేష్ నిమజ్జనానికి సిద్ధం

మద్నూర్, సెప్టెంబరు16: ఉమ్మడి మద్నూర్ మండలంలో 11రోజుల పాటు పూజలందుకున్న గణనాథుల నిమజ్జనానికి మండలకేంద్రంలోని మైసమ్మ చెరువులో అధికారులు ఏర్పాటుచేశారు. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉమ్మడి మద్నూర్ మండలం గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గణేష్ మండపాలను ఏర్పాటు చేశారు. ఘనంగా నవరాత్రులను పూర్తిచేసుకుని ఈనెల 17న మంగళవారం ఉత్సవ విగ్రహాలకు నిమజ్జనం నిర్వహించేందుకు భక్తులు సిద్ధమయ్యారు.

### ● ఏర్పాట్లు పూర్తి

నవరాత్రులు పూజలు అందుకున్న గణనాథులను నిమజ్జనం చేసేందుకు ఉమ్మడి మద్నూర్, డోంగ్లి మండలంలో అధికారులు ఏర్పాటుచేశారు. మద్నూర్ మండల కేంద్రంలోని మైసమ్మ చెరువులో అదే విధంగా డోంగ్లి మండల కేంద్రంలో నిర్వహించడానికి ఏర్పాటుచేసినట్లు మండల తహసీల్దార్ ముజీబ్, రేణుక చౌహాన్‌లు తెలిపారు. రెవెన్యూఅధికారులు పోలీసులు సమన్వయంతో పనిచేసి నిమజ్జనోత్సవం ఎటువంటి అవరోధాలు లేకుండా నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. నిమజ్జనం చేసే చెరువు వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు మద్నూర్ ఎస్సై విజయ్ కొండ తెలిపారు. భారీవిగ్రహాలను చెరువులో వేయడానికి క్రేన్‌ను రప్పించనున్నట్లు గ్రామ పంచాయతీ వారు ఏర్పాట్లను చూస్తున్నారు. శోభాయాత్ర సందర్భంగా మద్యం సేవిస్తే ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని వాటి నియంత్రణకు చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు వెల్లడించారు.

## రూ.లక్ష పలికిన లడ్డూ వేలం

మద్నూర్, సెప్టెంబరు16: మండలంలోని పెద్ద ఎక్లారా గ్రామంలో లడ్డు వేల ంపాట పాడగా రూ.1,00111కు భక్తుడు కొనుగోలు చేశాడు. అదేవిధంగా మండల కేంద్రంలోని పేఠ్కారి గణేష్ మండలి వద్ద రూ.34,501 లడ్డు, రూ. 12,600 యాపిల్ పండ్లు, రూ. 6 వేలు శాలువా, వేలం పాటలో భక్తులు దక్కించుకున్నారు. ఉమ్మడి మద్నూర్ మండలంలోని ఆయా గ్రామాలలో గణేష్ మండపాల వద్ద వినాయకుని చేతిలో ఉంచినటువంటి లడ్డుకు భారీగా వేలం పాట జరగడంతో నిర్వాహకులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

## నవోదయలో ముగిసిన కళోత్సవాలు

చొప్పదండి, సెప్టెంబరు 16: చొప్పదండి జవహర్ నవోదయ విద్యాలయంలో కళోత్సవాలు సోమవారం ముగిశాయి. ఆదివారం ఉత్సవాలు ప్రారంభం కాగా రెండురోజుల పాటు ఘనంగా జరిగాయి. తెలంగాణ క్లస్టర్ స్థాయిలోని తొమ్మిది జిల్లాల నవోదయ విద్యాలయాల నుంచి విద్యార్థులు ఈ ఉత్సవాలకు హాజరై వివిధ పోటీలలో పాల్గొన్నారు. నల్లగొండ విద్యాలయం వోకల్ మ్యూజిక్, నృత్యంలో నాగర్‌కర్నూల్, కరీంనగర్ ఇన్‌స్ట్రుమెంటల్, నిజామాబాద్ స్టోరీ టెల్లింగ్, మెదక్ విద్యాలయం విజువల్ ఆర్ట్స్ విభాగంలో ప్రథమ బహుమతి సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మంగతాయారు, మున్సిపల్ కమిషనర్ నాగరాజు, వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు

## సినిమా గైడ్ కామారెడ్డి



**కామారెడ్డి**

| | |
|---|---|
| శాంతి | - సరిపోదా శనివారం |
| దర్శన్ | - ఏఆర్ఎమ్ |
| ప్రియా 35 | - మత్తు వదలరా-2 |

**బాన్సువాడ**

| | |
|---|---|
| మహేశ్వరి | - శంకర్‌దాదా ఎంబీబీఎస్ |
| వెంకటేశ్వర | - మత్తు వదలరా 2 |

## చికెన్ ధరలు



| రకం | : | లైవ్ | విత్‌స్కిన్ | స్కిన్‌లెస్ |
|---|---|---|---|---|
| సుగుణ (కిలో) | : | 120 | 150 | 180 |
| వెన్‌కాబ్(కిలో) | : | 130 | 160 | 190 |

